అంతరించిపోతున్న కళలు, సాహిత్యాన్ని కాపాడాలి

మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్



సదస్సులో పుస్తకాలను ఆవిష్కరించిన వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: అంతరించిపోయే కళ, సాహిత్యాన్ని ప్రపంచీకరణ ద్వారా మళ్లీ నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభిప్రాయపడ్డారు. మనూలో 'వాయిసెస్ ఆఫ్ ఇండియా అండ్ బియాండ్: మొబిలిటీ, సస్టేనబిలిటీ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కమ్యూనిటీలు తమ గుర్తింపులను, చరిత్రలను భాషల ద్వారా ఎలా తిరిగి పొందవచ్చో అన్వేషించాలన్నారు. అనంతరం పలు చర్చా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఇంగ్లిష్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె నాగేంద్ర, హెచ్‌సీయూ ప్రొఫెసర్ ఎస్ అరుల్మోజి, ప్రొఫెసర్లు ఉమారాణి పప్పుస్వామి, ప్రొఫెసర్ ప్రభాకర్‌రావు, ప్రొఫెసర్ అజీజ్‌బానో ప్రసంగించారు.

మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన



ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అవగాహన కల్పిస్తున్న అధికారి నాగేశ్వరరావు

మూసాపేట: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విభూతి బ్రదర్స్ కళా జాత బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ బి నాగేశ్వరరావు మాట్లాడుతూ మట్టి విగ్రహం మహా విగ్రహం అని తెలిపారు. వినాయక చవితి పండగకు మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. చెరువులను పరిరక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అలాగే మట్టితో గణపతి విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజి వైస్ ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉత్తర, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ముఖ్యం

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్‌నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, జీహెచ్‌యంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా ప్రణాళిక పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు కుమారస్వామి, ప్రసాద్, నిఖిల్ పాల్గొన్నారు.

మేయర్‌కు వినతి



మేయర్ నీలారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిజాంపేట్: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రామచందర్‌లు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పాఠశాలలో అదనపు గదులు, విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు తదితర సదుపాయాలను కల్పించాలని కోరుతూ మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె మాట్లాడుతూ అధికారుల బృందంతో పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్‌లోని ఓంకారేశ్వర శివాలయం ద్వితీయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాయినేని చంద్రకాంత్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్, రాజేశ్వర్‌రెడ్డి మాయ రాజయ్య పాల్గొన్నారు.

మెహిదీపట్నంకు రెండు ప్రత్యేక బస్సులు

మియాపూర్: పటేల్‌గూడ బీహెచ్‌ఈఎల్ మెట్రో కాలనీ నుండి మెహిదీపట్నంకు (216ఎం/పి) రెండు బస్సులను 30వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు మియాపూర్ ఆర్టీసీ-2 డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు పటేల్‌గూడ బీహెచ్‌ఈఎల్ మెట్రో కాలనీ నుండి బీరంగూడ, లింగంపల్లి, ఆల్విన్‌క్రాస్ రోడ్డు, కొండాపూర్, హైటెక్ సిటీ, రాయదుర్గం మెట్రోస్టేషన్, టోలీచౌకి మీదుగా మెహిదీపట్నంకు వెళ్తుందని తెలిపారు. బయల్దేరు సమయాలు ఉదయం 5.30 గంటలకు, 8, 9, 11 గంటలకు తిరిగి సాయంత్రం 4.20, .5.20, రాత్రి 7.45, 8.45కు బస్సులు ఉంటాయని తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యా సౌధాల్లో

విద్యా సౌధాల్లో సౌర వెలుగులు

విద్యుత్ బిల్లులు ఆదా చేస్తున్న హెచ్‌సీయూ

- రూఫ్‌టాప్ సోలార్ పవర్ ఉత్పత్తికి 2013లో శ్రీకారం
- దేశంలోనే మొదటి యూనివర్సిటీగా గుర్తింపు



హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ భవనంపై సోలార్ ఫలకాలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సోలార్ పవర్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. విద్యుత్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు పదకొండేళ్ల క్రితమే శ్రీకారం చుట్టడం విశేషం. క్యాంపస్‌లో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకునేలా.. సోలార్ పవర్ ఉత్పత్తిని మరింత పెంచేందుకు కూడా ప్రణాళికలు రూపొందించి ముందుకుసాగుతున్నారు. ప్రస్తుతానికి పరిమితంగా సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తిని చేస్తున్నా భవిష్యత్తులో పూర్తిగా వినియోగించుకునేలా అవసరమైన ప్రణాళికలను రచించి అందుకు తగిన అనుమతుల కోసం ఎదురుచూస్తున్నారు.

- హెచ్‌సీయూలో 2013లో రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు.
- యూనివర్సిటీ పరిపాలనా భవనం, ఫైనాన్స్ బిల్డింగ్, హెల్త్ సెంటర్, సీఐఎస్ బిల్డింగ్, ఐజీఎం లైబ్రరీ, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ భవనాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి ఉత్పత్తి సాగిస్తున్నారు.



సోలార్ పవర్‌ప్లాంట్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న అప్పటి వీసీ రామకృష్ణ (ఫైల్)

- సోలార్ పవర్ ఉత్పత్తికి సౌరఫలకాలు, ఇన్వర్టర్లు, మౌంట్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ భాగాలు వినియోగిస్తారు
- క్యాంపస్‌లో ప్రస్తుతం 1000 కేడబ్ల్యూపీ సోలార్ పవర్ ఉత్పత్తికి ప్యానల్స్‌ను వినియోగిస్తున్నారు.
- హెచ్‌సీయూ క్యాంపస్ అంతటా ప్రస్తుతం ఈ సిస్టమ్ ద్వారా సరాసరి నెలకు 83,862.89 కేడబ్ల్యూహెచ్ ఉత్పత్తి చేస్తున్నారు.
- సూర్యకాంతి నుంచి ఫోటాన్లను సౌరఫలకాలు గ్రహించి సెమి కండక్టర్‌లో ఎలక్ట్రాన్‌లను ఉత్తేజపరిచి విద్యుత్‌ను సృష్టిస్తుంది.
- ఆ తర్వాత ఇన్వర్టర్ల సహాయంతో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు.

విద్యుత్ వ్యయం తగ్గించుకోవడానికి..



- క్యాంపస్‌లో విద్యుత్ వ్యయాన్ని తగ్గించేందుకే సోలార్ పవర్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు.
- హెచ్‌సీయూలో నెలకు రూ.7.36 లక్షల విద్యుత్ బిల్లు వ్యయాన్ని తగ్గిస్తోంది.
- భవిష్యత్‌లో మరిన్ని భవనాలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేయాలనే ప్రణాళిక ఉంది
- భారతదేశంలోనే 100 కేడబ్ల్యూ సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన మొదటి విశ్వవిద్యాలయ లైబ్రరీగా హెచ్‌సీయూ గుర్తింపు పొందింది. 1988 అక్టోబర్ 21న అప్పటి ఉపరాష్ట్రపతి శంకర్ దయాళ్‌శర్మ ప్రారంభించారు.
- ఈ సోలార్ పవర్ ప్లాంట్ 1.14 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు.దీన్ని రికార్డుస్థాయిలో కేవలం 30 రోజులలో ఏర్పాటు చేయడం మరో విశేషం.
- ఏడాదికి 21,11,358 కిలోవాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయాలని సంకల్పించారు.
- లైబ్రరీ తన అంతర్గత కార్యకలాపాలన్నింటినీ కంప్యూటరీకరించిన మొదటి లైబ్రరీ. భారతదేశంలో ఎలక్ట్రానిక్ జర్నల్‌లు, డేటాబేస్‌లకు సభ్యత్వాన్ని పొందింది. పదేళ్లు గడిచినా ఇప్పటికీ విజయవంతంగా ఈ ప్లాంట్ కొనసాగడం విశేషం.
- భవిష్యత్తులో క్యాంపస్‌లో మరిన్ని భవనాలపై కూడా సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

'మైండ్‌స్పేస్'లో జాబ్ మేళా



మాదాపూర్: మాదాపూర్‌లోని మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్స్ వినూత్నమైన ఈక్వల్ ఆపర్చ్యునిటీస్ జాబ్ ఫెయిర్‌ని బుధవారం నిర్వహించింది. ఇందులో వైకల్యం, మాట, వినికిడి లోపం ఉన్న వారు, అట్టడుగు నేపథ్యం, లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం. ట్రస్ట్ ఫర్ రిటైలర్స్ అండ్ రిటైల్ అసోసియేట్స్ ఆఫ్ ఇండియా, ఇన్ హార్మోని సంయుక్తంగా ఫెయిర్‌ను నిర్వహించారు. 400 మంది ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ కె రహేజా కార్ప్ సీఓఓ శ్రవణ్ గోనే, తెలంగాణ ఎస్‌సీఎస్ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ ఏ రాజేందర్ , ఎంసీసీ రంగారెడ్డి నుంచి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

రాయదుర్గం: ఖాజాగూడ ఓక్రిడ్జ్ పాఠశాలలో గురువారం పాఠశాల కో ఫౌండర్, సీఈఓ నాగ తుమ్మల రచించిన 'షామిదాస్- ది మ్యాన్ హుసా టుమారో' పుస్తకావిష్కరణ జరుగుతుంది. ఈ కార్యక్రమం అధ్యక్షుడు రాజ్ యార్లగడ్డ ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటలకు మిజోరం గవర్నర్ కె హరిబాబు చేతుల మీదుగా ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో శంతనూ చౌదరి, షామీదాస్, హరికిరణ్ వడ్లమాని పాల్గొంటారు.

ఆలయ ప్రథమ వార్షికోత్సవం



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజులోని విజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హాజరయ్యారు. గణపతి హోమం, పాలాభిషేకం, పుష్పార్చన, శాంతి కల్యాణం నిర్వహించారు.

క్రీడలకు కేంద్రంగా పటాన్‌చెరు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఘనంగా ప్రారంభమైన క్రీడోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: క్రీడలకు కేంద్రంగా పటాన్‌చెరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రీ మైదానంలో ఏర్పాటు చేసిన 68వ స్కూల్స్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడోత్సవాలను బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా శారీరకదారుఢ్యం, మానసిక ఉల్లాసంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మండల విద్యాధికారి రాథోడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్,ఎస్‌జిఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి గౌసుద్దీన్, సీనియర్ నాయకులు అఫ్జల్, ప్రమోద్‌గౌడ్, వెంకటేష్, మల్లారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో నైపుణ్య శిక్షణా కేంద్రం

చందానగర్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ ,ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణ ఉచితంగా అందిస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్య గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధి నిజాంపేట్‌కు చెందిన తిమ్మయ్య కుమార్తె బత్తిని గాయత్రికి కాకతీయ సేవా సమితి కూకట్‌పల్లి ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరానికి కళాశాల ఫీజు 29 వేల రూపాయల చెక్కును బుధవారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. కాకతీయ మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ సీటు వచ్చిన సందర్భంగా గాయత్రి చదువుకు ఎటువంటి ఆటంకం కలగకూడదని ఫీజులు చెల్లించామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసదాసు, గాంధీ, ఆనంద్, విద్యార్థిని తండ్రి తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



కట్టడాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: కూల్చివేసిన అక్రమ కట్టడాలను తిరిగి నిర్మిస్తే కఠిన చర్యలుంటాయని ఇంద్రేశం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాష్ అన్నారు.బుధవారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలోని పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో గ్రామ పంచాయతీ నుండి తీసుకున్న అనుమతులకు మించి రెండు భవన నిర్మాణాలు చేస్తుండటంతో నోటీసులు జారీ చేశారు. వినకుండా పనులు చేస్తుండటంతో కూల్చివేసినట్లు కార్యదర్శి సుభాష్ తెలిపారు. గ్రామ పంచాయతీ నుండి తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు.

రెస్టారెంట్ ప్రారంభం

చందానగర్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ రెస్టారెంట్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌతమ్ గౌడ్, చంద్రకాంత్‌రావు, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా..

మైత్రీనగర్ పార్కులో కనీస వసతులు కరువు ● పిచ్చిమొక్కలతో నిండిన పార్కు



మైత్రీనగర్ ఫేజ్ 3 పార్కులో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్ ఫేజ్ 3లో ఉన్న పార్కు నిరుపయోగంగా మారింది. గతంలో ఈ పార్కుకు ప్రహరీ లేకగా వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారని కథనాలు వెలువడడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించారు. కానీ నేటికీ పార్కులో కనీస వసతులు కల్పించలేదు. పార్కులో పిచ్చిమొక్కలు పెరిగిపోగా చెత్త చెదారం పేరుకుపోయింది. వాకింగ్‌ట్రాక్‌ను పునర్మించడంతో బాటు మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలి. ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. చిన్నారుల ఆట వస్తువులు పాడయ్యాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. జీహెచ్ఎంసీ అధికారులు నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తున్న క్రమంలో మైత్రీనగర్ పార్కును కూడా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఆట వస్తువులు



ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వసతులు కల్పించాలి



పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి. కాలనీవాసులు సేదదీరడానికి పార్కు ఎంతో ఉపయోగం . పార్కును పచ్చదనంతో నింపి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అధికారులు కృషి చేయాలి. – అనంత్, మైత్రీనగర్ కాలనీవాసి

పిల్లల ఆట వస్తువులను ఏర్పాటు చేయాలి



పార్కులలో చిన్నారుల కోసం వివిధఆట వస్తువులను ఏర్పాటు చేయాలి. వేసవి కాలం సాయంత్రం పూట చిన్న పిల్లలతో సేదతీరడానికి వస్తే పార్కు పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉంది. వెంటనే పార్కును అభివృద్ధి చేయాలి.

– శంకర్, మైత్రినగర్

ట్రాఫిక్ మళ్లింపు



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో డ్రైనేజీ, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో జయానగర్‌కు ట్రాఫిక్‌ను మళ్లించారు. బుధవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, ధాతి రమేష్, ఫారూఖ్, ఖలీమ్, సత్తార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



ప్రేమ్‌కుమార్

మియాపూర్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..మియాపూర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్ వాసి ప్రేమ్‌కుమార్(20) ఎలక్ట్రీషియన్. ఈ నెల 17వ తేదీన ఊరికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి మళ్లీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీలభ్యం కాలేదు. ఆందోళన చెందిన ప్రేమ్‌కుమార్ తల్లి వజ్రమ్మ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మరో ఘటనలో మహిళ..



జగదాంబ

ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మియాపూర్ న్యూ కాలనీకి చెందిన జగదాంబ(37) ఈ నెల 13వ తేదీన ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో భర్త రాజ్‌కుమార్ స్నేహితులు, బంధువులు పలుచోట్ల వెతికినా జగదాంబ ఆచూకీ లభించలేదు. దీంతో భర్త రాజ్ కుమార్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టాస్కులు, కమీషన్ పేరిట సైబర్ వల

రూ.7 లక్షల 80 వేలు పోగొట్టుకున్న ప్రైవేటు ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్ పేరిట సైబర్ నేరగాళ్ల వలలో బడ్డ ఓ వ్యక్తి రూ.7 లక్షల 80 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆగస్టు 8 వ తేదీ తన వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. ఆ వ్యక్తి తన వివరాలను నమోదు చేయగా సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ప్రైవేట్ ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తన కిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.7 లక్షల 80 వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు అతనితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ చూపిస్తూ వచ్చారు. చివరగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు .దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి,అనంతరం పటాన్‌చెరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు.

చెఫ్ జాబ్ ఉందంటూ..

పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన చెఫ (వంట మాస్టర్) ఆన్‌లైన్‌లో చెఫ్ ఉద్యోగం కోసం వెతుకుతుండగా అపరిచిత వ్యక్తులు ఏప్రిల్ 25న మెసేజ్ పంపారు. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి వారు చెప్పిన విధంగా పలు దఫాలుగా జాబ్ ప్రాసెస్ కోసం రూ. లక్ష 75 వేలు పంపాడు. తర్వాత ఉద్యోగం గురించి అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు.